క్లుప్తంగా

సక్రమంగా గృహాధారిత విద్య



దివ్యాంగ విద్యార్థిని హేమ వద్ద వివరాలు సేకరిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: దివ్యాంగ విద్యార్థులకు ఐఈఆర్‌టీలు గృహాధారిత విద్యను సక్రమంగా అందించాలని ఎంఈవో త్రినాధరావు సూచించారు. మండలంలోని సింగిరెడ్డివలస గ్రామంలో హోమ్‌బేస్డ్ విద్యార్థిని మరిశర్ల హేమ వద్దకు ఆయన శనివారం వెళ్లి, ఆమె ఆరోగ్య పరిస్థితిని, విద్య పట్ల స్పందిస్తున్న తీరును, సహిత విద్య ద్వారా అందిస్తున్న కార్యక్రమాలు, దివ్యాంగ పిల్లలకు ఇచ్చే పెన్షన్ అందుతున్నదీ, లేనిదీ వంటి వాటిని గూర్చి విద్యార్థిని తల్లిని ఎంఈవో అడిగి తెలుసుకున్నారు. మంచానికే పరిమితమైన పిల్లలకు ఇంటి వద్దకే విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఐఈఆర్‌టీ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు

బొబ్బిలి: బుడా(బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలోని 22 అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామని బుడా అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ దేవకుమార్ తెలిపారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో 300 చదరపు గజాల స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శులు అనుమతులు ఇవ్వవచ్చని, అంతకుమించి ఉంటే బుడా అనుమతులు తీసుకోవాలన్నారు. ఇటువంటి ఇళ్లు ఎన్ని ఉన్నాయో గుర్తిస్తున్నామన్నారు. జగనన్న స్మార్ట్ లేఅవుట్‌ల కోసం పట్టణంలో గుర్తించిన స్థలాలు అనువుగా లేవన్నారు. కొత్తగా స్థలాలను గుర్తించాలని తహసీల్దారులకు లేఖలు రాశామన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సభ్యులు ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ప్రారంభమైంది. వ్యవసాయం, ఉపాధి హామీ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, విద్య తదితర శాఖలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు కోరారు. సమావేశంలో ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దారు ఎల్లారావు, ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, ఏపీవో హరనాధరావు, ఏవో మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలి



పాగిరిలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: పంచాయతీల అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాగిరి, బొద్దాం గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా కేంద్రాల నిర్వహణపై ఆరా తీశారు. ఇక్కడి కేంద్రాల్లో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తాచెదారంతో ఎరువులు తయారు చేసి, వాటిని తక్కువ ధరకు రైతులకు ఇచ్చి, పంచాయతీకి ఆదాయం చేకూరేలా చూడాలన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, సకాలంలో ఇంటిపన్ను వసూలు ద్వారా కూడా పంచాయతీలకు ఆదాయాన్ని తెచ్చిపెట్టవచ్చన్నారు.

పోరాంలో అగ్నిప్రమాదం

మెంటాడ: మండలంలోని పోరాం గ్రామంలో మామిడి సత్యనారాయణ కొత్త ఇంట్లో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో బీరువాలో దాచుకున్న రూ.45 వేల నగదుతో పాటు బట్టలు, పలు ధ్రువపత్రాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ లెంక సన్యాసప్పలనాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 25 కిలోల బియ్యం సాయంగా అందించారు.

సన్మానం

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఆర్‌వీజే నాయుడు, ఎస్.జయకృష్ణలను శనివారం ఘనంగా సత్కరించారు. ఇటీవల వారు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నేపథ్యంలో తాము సన్మానించినట్లు సిబ్బంది తెలిపారు. అంకితభావంతో పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని, మిగతా ఉపాధ్యాయులు కూడా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, ఎ.దామోదరరావు, సీహెచ్ సత్యనారాయణ, పి.గౌరీప్రసాద్, వై.భాస్కరరావు, వి.సూర్యనారాయణ, ఎస్.శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త గురజాడ



రాజాం సిటీ: గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, తదితరులు

మహాకవి, అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ వేంకటఅప్పారావు జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని, గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. తెలుగు సాహిత్యంలో వాడుక భాషను ప్రోత్సహించిన వారిలో గురజాడ ప్రముఖులు అని, బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి సాంఘిక దురాచారాల నిర్మూలనకు ఆయన ఎనలేని కృషి చేశారని ప్రశంసించారు. ఆయన గొప్ప సంఘసంస్కర్త అని, ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని కోరారు.

–బొబ్బిలి, రాజాం



రేగిడి: లింగాలవలసలో గురజాడ జయంతి, హిందీ దివస్ కార్యక్రమాల్లో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు



తెర్లాం శాఖా గ్రంథాలయంలో గురజాడ జయంతి వేడుకలు



బొబ్బిలి: మహాకవి గురజాడ అప్పారావు చిత్రపటం నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, తదితరులు



బొబ్బిలి రూరల్: అలజంగిలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామానికి చెందిన మండల వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్‌మోహన్ రావు తండ్రి బంగారినాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ శనివారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బంగారినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, సర్పంచ్‌లు చుక్కా వెంకటినాయుడు, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, దార గురునాధరావు, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మాజీ ఎంపీపీ చలుమూరి అప్పలనాయుడు సతీమణి నారాయణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, రాయిపిల్లి రామారావు, రత్నాకర్, అన్నవరం, ముసలినాయుడులతో పాటు మరి కొంతమంది టీడీపీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను కలిసి, పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పిల్లలను కని ఏం చేయమంటావ్?



మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: సీఎం చంద్రబాబునాయుడు ఎక్కువమంది పిల్లలను కనండి అని ఇచ్చిన పిలుపుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయంపై రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్షుంనాయుడు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా ప్రథమ స్థానానికి ఎగబాకుతున్న నేపథ్యంలో అందరూ జనాభా తగ్గించుకుంటే మంచిదని, ఒకరు లేదా ఇద్దరు పిల్లలను కనాలని పిలుపునిస్తుంటే చంద్రబాబు మాత్రం ఎక్కువమంది పిల్లలను కనాలని అనడం అర్థరాహిత్యమన్నారు. పేదరికం, నిరక్షరాస్యత పెరగడానికి ముఖ్య కారణాల్లో జనాభా పెరుగుదల ఒకటి అని తెలీదా అని అన్నారు. పిల్లలను కని ఏం చేయమంటారు అని ప్రశ్నించారు. ఇలాంటి చౌకబారు మాటలు ఆడి, ప్రజల దగ్గర చులకన అయిపోవద్దని హితవుపలికారు.

ఎల్లోప్లేట్ల వినియోగంపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలోని రైతులకు ఎల్లోప్లేట్ల వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ వరి పంటను ఆశించే పురుగుతెగుళ్ల నివారణకు ఈ ఎల్లోప్లేట్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఎల్లోప్లేట్లు పురుగులను ఆకర్షిస్తాయని, తద్వారా వాటి ప్రభావం పంటపై లేకుండా చేస్తాయన్నారు. ఎకరానికి 20 ప్లేట్లు వరకు అమర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, యు.రమణ, సర్పంచ్ కరణం గోవిందరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రశీదులు భద్రపరుచుకోవాలి



మాట్లాడుతున్న నాగసుందర్

బొబ్బిలి: వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వస్తువులు లేదా సేవలకు సంబంధించి, రశీదులు భద్రపరుచుకోవాలని వినియోగదారుల కోర్టు అధ్యక్షుడు ఆర్.వెంకటనాగసుందర్ తెలిపారు. స్థానిక రఘు కళాశాలలో వినియోగదారుల చట్టంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. సరైన వస్తువులు, సేవలు అందని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తే న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు లెంక సత్యం, గౌరవాధ్యక్షుడు సోరు సాంబయ్య, తహసీల్దారు ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రాజాం: పెనుబాక పాఠశాలలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ బోడమ్మ

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పెనుబాక గ్రామ సర్పంచ్ బండి బోడమ్మ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెనుబాక గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు మహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ బింగి కోటీశ్వరి, రాజాం గ్రీన్‌బెల్ట్ కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు పాల్గొన్నారు.

రాజాం సిటీ: రాజాం పట్టణ మెయిన్ రోడ్డులో స్వచ్ఛతా హీ ర్యాలీ శనివారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు జెండా ఊపి, ఈ కార్యక్రమం ప్రారంభించగా, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

తెర్లాం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శంబంగి రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రజలకు స్వయం సహాయక సంఘాల సభ్యులు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మండలంలోని గురవాం కేజీబీవీ విద్యార్థులకు శనివారం నేత్రవైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు, ఎస్‌వో సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, తమ్మయ్యవలస గ్రామాల్లో ఇటీవల జరిగిన విద్యుత్, పిడుగు ప్రమాదాల్లో నష్టపోయిన వారికి ఎమ్మెల్యే బేబీనాయన ఆర్థికసాయం చేశారు. ఎం.ఆర్.అగ్రహారం గ్రామానికి చెందిన తాడు అనే పాడిరైతుకు చెందిన రెండు ఆవులు విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందగా, ఆ రైతుకు ఎమ్మెల్యే తనవంతు సాయంగా రూ.20 వేలు శనివారం అందజేశారు. అలాగే కొన్నిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇంటిపై పిడుగు పడడంతో బొత్స ఈశ్వరమ్మ ఇంట్లోని విలువైన వస్తుసామగ్రి ధ్వంసం కాగా, ఆమెకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఎన్.వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి గ్రామదేవతల పండగ

రాజాం సిటీ: రాజాం గ్రామదేవతల పండగ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి జరిగే రాజాం–సారధి గ్రామదేవతల పండగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవంలో ఆది, మంగళవారాల్లో మొత్తం తొమ్మిది రోజుల పాటు తొమ్మిది ఘటాలను ఊరేగించనున్నారు. దీనికి సంబంధించి, పట్టణంలోని పలు వీధుల్లో శనివారం చాటింపు వేశారు. మొదటి ఘటం ఆదివారం, రెండో ఘటం 24న మంగళవారం, మూడవ ఘటం 29న, నాలుగవ ఘటం అక్టోబరు 1న, ఐదవ ఘటం 6న, ఆరవ ఘటం 8న, ఏడో ఘటం (బంగారమ్మ అనుపు ఘటం) అక్టోబరు 10న, ఎనిమిదో ఘటం(దుర్గమ్మ అనుపు ఘటం) 13న, చివరిగా 15న బురదలపోలమ్మ అనుపు ఘటంతో పండగ ముగియనుందన్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈ పండగకు సుదూర ప్రాంతాల్లోని వారంతా వచ్చి, తమ మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

తెర్లాం: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకపోతే చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని ఎంఈవో జె.త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని సింగిరెడ్డివలస ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన.. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పిల్లల చేతిరాత పుస్తకాలు, అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం వంటకాలు చేయాలని, పథకం అమలును ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. వంటకాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని ఆయన హెచ్చరించారు.

కరపత్రాల ఆవిష్కరణ

బొబ్బిలి: పట్టణంలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించి, కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు జేవీవీ సభ్యులు తెలిపారు. మండల స్థాయిలో అక్టోబరు 1వ తేదీన ఈ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కె.కృష్ణదాసు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే..

చంద్రబాబు తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

- సీఎం చంద్రబాబు వైఖరిపై మాజీ ఎమ్మెల్యే శంబంగి మండిపాటు

బొబ్బిలి: అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ప్రజలకు ప్రభుత్వం చేసిందేమీ లేదని, దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తప్పుడు ప్రచారానికి తెరలేపారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడిన ఆయన.. అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో దాడులను ప్రోత్సహించి, రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యేలా చేశారని, ఇటీవల విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో కూడా తీవ్రంగా విఫలమయ్యారని, అలాగే సూపర్ సిక్స్ హామీల్లో ఇంతవరకు ఏ ఒక్కటీ అమలు చేయలేదని, వీటన్నింటి నుంచి ప్రజల మైండ్ డైవర్ట్ చేసేందుకే లడ్డూ ప్రసాదం రాజకీయం మొదలెట్టారని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ఇటువంటి నీచరాజకీయాలు చేయడం వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని విషప్రచారం చేయడం వెనక ఉన్న దుర్మార్గపు ఉద్దేశ్యాన్ని ప్రజలంతా గమనించారన్నారు. ప్రజలు ఎక్కడ పథకాలు అమలు చేయమంటారోనన్న భయంతోనే రోజుకో దుష్ప్రచారానికి తయారవుతున్నారని దుయ్యబట్టారు. నిజంగా లడ్డూ ప్రసాదం కల్తీ అయితే రాష్ట్రంలో వారి ప్రభుత్వమే ఉంది.. కేంద్రంలోనూ వారి మిత్ర ప్రభుత్వమే ఉంది కదా.. నిజనిజాలు ఎందుకు తేల్చలేకపోతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు అండ్ కో.. చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు కనుకనే జూలైలో లడ్డూ కల్తీ జరిగినా ఇంతవరకు ఏం చేయలేకపోయారన్నారు. బాగా గమనిస్తే చంద్రబాబు ఆరోపణల తర్వాతనే ఆలయ ఈవో మాటలు మారాయన్నారు. దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసి, తద్వారా హిందువులకు వైఎస్సార్ సీపీని దూరం చేసే కుట్రను అంతా గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇటువంటి నీచ రాజకీయాలు మాని, ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టిసారించాలని హితవుపలికారు. సమావేశంలో మండల జేసీఎస్ ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, గూడెపువలస సర్పంచ్ ఎ.గణేశ్వరరాజు, వైఎస్సార్ సీపీ కార్యదర్శి గొట్టాపు రామారావు, మున్సిపల్ వార్డు ఇన్‌చార్జి బూడి ఆనందరావు, న్యాయవాది రుంకాన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

బొబ్బిలి: ఆరోగ్యవంతమైన జీవనానికి పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని 28వ వార్డులో కోరాడ వీధి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ప్రయోజనాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌష్టికాహారం సరఫరా చేస్తున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.నిర్మల, మహిళా పోలీసులు నాగమణి, సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

వంగర: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నూకాలమ్మ అన్నారు. మండలంలోని కొప్పరవలస గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహార ప్రదర్శన చేపట్టి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

తెర్లాం: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–3లో పౌష్టికాహారం ప్రయోజనాలు, యోగాసనాలపై శనివారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతినెలా విధిగా వైద్య తనిఖీలు చేయించుకోవాలని గర్భిణులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ప్రశాంతి పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

రాజాం: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని రాజయ్యపేట గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం సందర్శించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. లెస్సన్ ప్లాన్, టీఎల్‌ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ఆధారంగా ఉపాధ్యాయులు బోధిస్తే బోధన సమర్థవంతంగా ఉంటుందని, అప్పుడే విద్యార్థులకు సులువుగా పాఠ్యాంశాలు అర్థమవుతాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, రుచి, శుచికరమైన భోజనం విద్యార్థులకు పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గేదెల రమేష్ పాల్గొన్నారు.

వంగర: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన.. పాఠశాల రికార్డుల నిర్వహణ, విద్యార్థుల విద్యాప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు.

మాదకద్రవ్యాలతో జీవితం చిత్తు



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: మాదకద్రవ్యాలతో జీవితం చిత్తు అవుతుందని సీఐ నారాయణరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల కేంద్రం అంతర్‌రాష్ట్ర కూడలి కావడంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఈ మండల కేంద్రం మీదుగా గంజాయి, ఖైనీ, గుట్కా వంటి నిషేధిత వస్తువుల రవాణా జరిగే అవకాశం ఉన్నందున పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు .కొట్టక్కి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన తర్వాత అక్రమ రవాణాలు తగ్గాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత మత్తు పదార్థాలకు బానిసలవుతుండడం బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే, ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వి ప్రసాదరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రుణాల చెల్లింపులపై ఆడిట్

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో పొదుపు సంఘాల రుణాల చెల్లింపులపై వెలుగు శాఖ అధికారులు ఆడిట్ నిర్వహిస్తున్నారు. పంచాయతీలో మొత్తం 108 సంఘాలు ఉండగా, తీసుకున్న బ్యాంకు రుణాలు వీవోఏ తన సొంతానికి వాడుకున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ ఆడిట్ చేపట్టారు. రోజుకు 10 సంఘాల చొప్పున ఆడిట్ నిర్వహిస్తామని, ఆడిట్ పూర్తయిన తర్వాత ఎంతమేర అవినీతి జరిగిందన్న అంశాలు వెల్లడిస్తామని ఏపీఎం శ్రీనివాసరావు తెలిపారు.

ధరల పట్టిక ప్రదర్శించాలి

బాడంగి: మండలంలోని మీసేవా కేంద్రాల్లో ప్రజలకు అందించే ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి, ప్రభుత్వం నిర్ణయించిన రుసుం వివరాలను పట్టిక రూపంలో ప్రదర్శించాలని తహసీల్దారు పి.సుధాకర్ శనివారం సూచించారు. ప్రభుత్వ నిర్దేశిత ధరకన్నా ఒక్కపైసా ఎక్కువ తీసుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా విశ్వకర్మ జయంత్యుత్సవాలు

రాజాం: స్థానిక వైఎస్సార్ పార్కు వద్ద విరాట్ విశ్వకర్మ ఆలయంలో విశ్వకర్మ జయంత్యుత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాజాం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతితో పాటు పట్టణానికి చెందిన పలువురు భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని, ప్రత్యేక పూజలు, యాగాలు నిర్వహించారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన

వంగర: మండలంలోని కింజంగి గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. మరువాడ ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తొలుత జిల్లేడు ద్రావణం తయారీ వివరించి, దాని ప్రయోజనాలు తెలిపారు. వరి పంటలో జిల్లేడు ద్రావణం వినియోగిస్తే పొటాష్ వినియోగించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులంతా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయురాలు వి.లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ ఎ.శ్రీదేవి పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. దాదాపు 200 మంది క్రీడాకారులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడాంశాల్లో పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని చింతాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారంతా నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీలు వెంకటనాయుడు, సత్యనారాయణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

బొబ్బిలి: పట్టణంలోని చీపురుపల్లి వీధిలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హిందూ ఉత్సవ సమితి చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బేబీనాయన హాజరై, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు తెలిపారు.